# అంతయున్న నరకమేకద్న వివాహంబు

## - భమిడిపాటి సోమయాజి

"ఏమిత్రా నిన్న సాయంకాలం అంత స్పీడ్‌గా వెడుతున్నావ్. ఏమైనా సినిమా ప్రోగ్రామ్ పెట్టిందా మీ శ్రీమతి?" అని అడిగాడు భాస్కర్ తన మిత్రుడు ప్రభాకర్‌ని.

"సినిమానా! పాడా! సంసారమే పెద్ద సినిమాలా వుంది. మన మూర్తిగాడు గోదావరి ఎక్స్‌ప్రెస్‌లో అనకాపల్లి వెళుతున్నాడు. నా బండి మీద సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర దింపమన్నాడు.

"అనకాపల్లి ఎందుకురా!"

"నీకు తెలీదా వాడికి పెళ్లి కుదిరింది. నిశ్చయ తాంబూలాలకి వెళ్లాడు."

"బాగుంది ! మొన్నటిదాకా పెళ్లి చేసుకోను అని ప్రగల్భాలు పలికాడు."

"అవున్రా! నేనే చెప్పాను. ప్రతీ ఆదివారం 'ఆ హోటల్ భోజనం సరిపడలేదు' అంటూ మా యింటికి వచ్చి తినేసిపోతున్నాడు. ఇద్దరు పిల్లలతో యీ చాకిరీ చెయ్యలేనని నా భార్య ఒకటే గోల పెడుతోంది. పైగా యీ మూర్తిగాడి పెళ్లయితే మూడు కొబ్బరికాయలు కొడతానని మొక్కుకుంది దేవుడికి" అంటూ చెప్పాడు ప్రభాకర్.

"అంటే, నీ భార్య సుఖం గురించి ఓ స్నేహితుడ్ని నరక కూపంలోకి నెడుతున్నావన్న మాట"

"కేవలం నా సలహా ప్రకారం చేసుకోవడం లేదులే. మొన్న వాళ్లు పెద్ద మేనమామ వచ్చి 'భోజనమైన తర్వాత మీ అత్తయ్య కాళ్ళు నొక్కుతుంటే స్వర్గసుఖమేరా' అన్నాడట."

"మరి నువ్వు చెప్పకపోయావా! తర్వాత, తర్వాత ఏ షీకైనా నొక్కితే భస్మావ్ అని"

"సర్లే! ఏదో చావండి! నేవస్తాను" అంటూ" వెళ్లిపోయాడు భాస్కర్.

***

మిత్రులందరూ కుటుంబ సమేతంగా మూర్తి పెళ్లికి తరలివెళ్లారు. పెళ్లి అనకాపల్లిలో జరిగింది. మగ పెళ్లివారు విడిదిలో దిగినప్పట్నుంచి పెళ్లికొడుకుని కిటికీలోంచి, తలుపు సందుల్లోంచి చూస్తూనే వున్నారు ఆడపెళ్లివారు. మూర్తి ముక్కు కొంచెం పెద్దది! ముక్కు విషయంలో తన మేనమామ పోలిక.

"ఆ ముక్కు అంత పెద్దగా లేకుండా, నోరు మరీ అంత చిన్నది కాకుండా వుంటే పెళ్లికొడుకు బాగున్నట్లే" అని కొంతమంది ప్రేక్షకులు మెల్లిగా అన్న మాటలు విన్న మూర్తి వీలైనప్పుడల్లా ముక్కు చివరన కొంచెం నొక్కుకుంటూ, ముక్కు నెప్పెట్టినప్పుడల్లా నోరు సాగతీసుకుంటూ కూర్చున్నాడు. అనకాపల్లిలో పెళ్లి ఘనంగా జరిగింది. తర్వాత పెళ్లికూతురు కాపురానికి ఓ నలభై కిలోల బెల్లంతో సహావచ్చింది. అందులో కొంత బెల్లం భాస్కర్, ప్రభాకర్ సమపాళ్లలో పట్టుకుపోయారు.

ఆ బెల్లం వాడుకుంటూ, "మీ స్నేహితునికి పెళ్లవడం వలన నాకు చాకిరీ తప్పింది! పైగా బంగారంలాంటి బెల్లం వచ్చింది! అంది భాస్కర్ భార్య వెలిగిపోతూన్న మొహంతో.

***

కొన్నాళ్ళ తర్వాత మూర్తి 'సర్వాంతర్యామి' అయిపోయాడు.

"వీడేమిత్రా! ఓ చోట స్థిరంగా వుండడం లేదు! గ్యాస్ క్యూలో వీడే! రైతు బజార్లో వీడే! పాలక్యూలోనూ వీడే!" అన్నాడు భాస్కర్ ప్రభాకర్‌తో.

"వాక్యంలో కర్త, కర్మ లేకుండా మాట్లాడకురా!"

"అదేరా ! మన మూర్తిగాడి విషయం" అన్నాడు ప్రభాకర్.

"అది వాడి కర్మ!" అన్నాడు భాస్కర్.

"మరి పెళ్ళి చేసుకో అని సలహా యిచ్చిన నువ్వు కర్తవన్న మాట."

"కర్మని బట్టి జరిగే వాటికీ కర్త ఆ భగవంతుడే! దాన్ని బట్టి మనిషి క్రియాశీలకుడు అవుతాడు" అన్నాడు భాస్కర్.

వీళ్ళు మాట్లాడుతూంటే, రెండు సంచులు పట్టుకుని మూర్తి వచ్చాడు.

"అరే యింకో పదికిలోలు బెల్లం కావాలిరా! యీసారి మా చెల్లెలు అనకాపల్లి వెళితే తెప్పించరా!" అన్నాడు భాస్కర్.

"ఈ సంసారంలో చేదు నేను మేస్తాను. ఆ అనకాపల్లి తీపి బెల్లం మీరు తినండిరా!" అంటూ 'వట్టి వెధవలు. వీళ్ళకి డయాబిటీస్ ఎందుకు రాదో?' అనుకున్నాడు మూర్తి స్వగతంగా.

"బాబూ! బెల్లం వద్దు ఏం వద్దు! నువ్వు సుఖంగా వుంటే అదే చాలు!" అన్నాడు భాస్కర్.

"ఏ సుఖం రా! ఆ పెళ్లిరోజు కాసేపు తల పాగా చుట్టి, మెళ్లో పూలదండలూ, చెమ్కీ దండలూ వేసి వూరేగిస్తారు. తర్వాత చెమట పట్టిన మొఖంతో, అన్ని అర్థమైన పన్లూ జీవితమంతా చెయ్యాలి. అసలీ పెళ్లి కనిపెట్టిన వెధవ ఎవరో వాణ్ని చంపేస్తాన్రా!" అన్నాడు మూర్తి.

"ఇంకెవర్రా! ఇటువంటి వెధవ పన్లు చేసేది ఈ భాస్కర్‌గాడే !" అన్నాడు ప్రభాకర్.

"నిజమేరా! వీడి ప్రోద్భలంతోనే యీ పెళ్ళి అనే నరక రూపంలో దిగాను!" అన్నాడు మూర్తి.

"అసలు, నరకం భూమ్మీద అనుభవించేస్తే, పైకి పోయిన తర్వాత యిక స్వర్గమే స్వర్గం" అన్నాడు భాస్కర్.

"వాడలా చెప్పాడు కాని, అసలు మన అటక మీదేముందో మనకి తెలియదు. ఎక్కడో కనిపించని చోట స్వర్గముందనీ, అక్కడ సుఖముంటుందనీ నేను నమ్మనురా! అసలు నాలా బ్రహ్మాండంగా బ్రహ్మచారిలా వుండేవాడవు. అసలు పెళ్లి ఎందుకు చేసుకున్నావ్! ఓ మాట నాకు చెపితే నేను సరియైన సలహా యిచ్చేవాడ్ని" అన్నాడు ప్రభాకర్.

"ఏదేమైతేనేం. వీడి పెళ్లైన తర్వాత, నా భార్యా నేనూ కూడా హాయిగా వున్నాం! ప్రతీ ఆదివారం మా యింటికి వచ్చేసేవాడు!'' అన్నాడు భాస్కర్.

"వెర్రి వెధవ! కొన్ని ఆదివారాలు మీ యింటికి రాకపోతే యీ వివాహ ప్రమాదంలో పడక పోను'' అన్నాడు ప్రభాకర్.

★★★

పెళ్లైన నాలుగు నెలలకి తన అత్తారింటి తరపున జనం, రెండేసి బెల్లపచ్చులు పట్టుకుని దిగిపోయేవారు. వారం, వారం యీ బెల్లమేం చెయ్యాలో తెలియక భేజారెత్తి పోయాడు మూర్తి. అక్కడకీ ఆ అచ్చులు చితక్కొట్టి, తన మిత్రులకి యిచ్చేసేవాడు. ఆ వచ్చిన వాళ్లకి దిండ్లు సరిపడేవిగాదు. పాపం! ఆ బెల్లపచ్చులే తలకింద పెట్టుకు పడుకునే వారు. ఈ బెల్లం వలన యిల్లంతా ఈగలు, చీమలు తాండవం చేసేవి. కొన్నాళ్ళకి మూర్తి చెప్పిన బాధలు విని, మంగళగిరి ఆఫీస్‌లో ఓ ఖాళీ వచ్చిందనీ, ఎంతో కొంత డబ్బిచ్చి, ఆ వూరికి ట్రాన్స్‌ఫర్ చేయించుకోమని సలహా యిచ్చారు ఆఫీసులో వాళ్ళు.

మంగళగిరి వెళ్లిపోయాడు. మూర్తి భక్తులకి కిలోకి పదిపైసలు చొప్పున తీసుకుని బెల్లం యిచ్చేవాడు. బెల్లం ఊరికే తీసుకుంటే ఆ మంగళగిరి పానకాలస్వామికి పానకం యిచ్చిన ఫలితం దక్కదని భక్తుల నమ్మకం! మంగళగిరి వెళ్ళిన తర్వాత మూర్తి యింట్లో బెల్లపచ్చుల నిలవతగ్గి యీగల చీమల బెడద కొంత తగ్గింది. అయినా 'అసలీ పెళ్లి కనిపెట్టినవాడెవడో' అని నిత్యం అనుకునేవాడు. మూర్తి భార్య ఎం.ఎ.తెలుగు లిటరేచర్ పాసయింది. రోజూ వంట చేసుకునేటప్పుడు పద్యాలు గట్టిగా చదువుతుంది. ఓ రోజు రాత్రి మంచి పద్యమేదైనా చదవమన్నాడు. ఆవిడ భారతంలోని 'నలసారము సంసార మఖాల దుఃఖావహాము, భయానికే తన మతి చంచలము పరాధీనం యిందుల జీవనమేల నమ్మెదురు తత్త్వవిదుల్'' అనే పద్యం చదివింది.

"ఈ పద్యం పెళ్ళవకముందు కూడా నీకు తెలుసా'' అని అడిగాడు మూర్తి.

"తెలుసు'' అంది.

"తెలిసి కూడా ఎందుకు పెళ్ళి చేసుకున్నావ్''.

తెలియదని కళ్ళల్లో నీళ్ళు పెట్టుకుంది.

"ఏడవకు ! ఏడవాలిసింది నేను'' అన్నాడు.

"ఆ ! అన్నట్లు అరయన్ వంశము నిల్పనేకద వివాహంబు'' అంది.

"అది కాదు! అరయన్, నరకమేకద వివాహంబు'' అన్నాడు మూర్తి.

★

